మృగవేదన

పి. గణపతిశాస్త్రి

౧

మహారణ్య సరోవర తరంగాలపై హంస మిథునాలు హేలగా ఊయ్యాలలూగాయి. సాయంకాల సూర్యకిరణాలు హంసల రెక్కలపైబడి అలాగే జారిపోయాయి. ఆ నిశ్చల సరోవరం పరిసర మహారణ్యానికీ, పైనున్న విశాలాకాశానికీ ఒక పెద్దవెండి అద్దంలా స్వచ్ఛంగా ప్రకాశించింది.

ఒక హంసమిథునం ఒయ్యారంగా తేలుతూ సరోవరంలో పచ్చలగొడుగులా పైకి పెరిగిన ఒక తామరాకు నీడలో నిలిచింది. అంతలో మగ హంస తన తెల్లని రెక్కల్లో ముక్కుంచి మాగన్ను పెట్టి హాయిగా నిద్రపోయింది.

ఒక చక్రవాక మిథునం ఆ పక్కనే నీటిలో అల్లల్లాడే తామరాకుమీద వాలింది. వెనువెంటనే దానిపై కెంపుల్లా తళతళలాడే నీటిబిందువులన్నీ కొలనిలోనికి దిగజారాయి. ఆ అలికిడికి బెదిరిన చిరుమీనులొకటి రెండు తళతళ మెరుస్తూ పైపై కెగిరిపడ్డాయి. సాయంకాల కిరణాలలో ఆ మీనుల చిరుమెరుపు లత్యంత మనోహరంగా స్ఫురించాయి. మగ చక్రవాకం తటాలున పైకెగిరిపోయింది. దాని రెక్కల రెపరెపలు నిర్మల కాసారంలో ప్రతిఫలిస్తూ క్రమక్రమంగా అదృశ్యమైపోయాయి.

స్వరోచి హృదయం క్షణకాలం ఆ సరోవర సౌందర్యంలో తన్మయమై ఓలలాడింది.

మరి ఒకక్షణంలో ఆ ప్రాంతంలో అంతటా కలకల నవ్వులు, కంకణ ఝుణత్కారాలు, కాలి అందెల రవళులు, మొలనూలి మువ్వల గలగలలు వ్యాపించాయి.

అంతలో ఒక సుందరి హఠాత్తుగా వచ్చి అతని రెండుకళ్లు మూసింది. తన ముగ్గురు భార్యలలోను అలాగ హఠాత్తుగా కన్నులు మూసినవారెవరో అతనికి తెలియలేదు. కళ్లు మూసిన జవ్వని చేతులు, చెక్కిళ్లు తడిమి చూచాడు. అతనికేమీ బోధపడలేదు. ఆసమయంలో స్ఫురించిన పేరేదో పైకి చెప్పాడు:

"మనోరమ!"

అతని ముగ్గురు భార్యలు కలకలనవ్వారు! కాని అతని కళ్లుగప్పిన చేతులపట్టు విడలేదు. స్వరోచి ఇంకొక పేరు చెప్పాడు:

"విభావసి"

అయినా ఆ పట్టు విడలేదు. మళ్ళీ నవ్వులు వినిపించాయి. స్వరోచి మూడో పేరుచ్చరించబోయాడు. అంతలోనే కళావతి తనచేతి పట్టు విడిచిపెట్టింది:

"ఇక చెప్పక్కరలేదు. ఆ మూడో దాన్ని నేనే. మీరోడిపోయారు."

అని హఠాత్తుగా అతని కెదురుగా నిలబడింది. ఆమెతోబాటూ ఆ మిగిలిన ఇద్దరు అతనిని గేలిచేస్తూ ఉవ్వెత్తుగా నవ్వారు!

ఆ ముగ్గురు అతనితో ఏవో పరిహాస ప్రసంగాలారంభించారు. ఆ ప్రసంగాలొక మొదలు తుద లేకుండా అలాగే సాగిపోయాయి. వారేమి ప్రసంగిస్తున్నారో వారికే తెలియదు! మహోత్సాహంతో ఉరకలువేస్తూ కలకలలాడే వారి వినోద ప్రసంగాలు అడివిలో లేడిపిల్లల్లా ఛెంగు ఛెంగున గంతులువేస్తూ ఆ మహారణ్యంలో కనులకు మిరుమిట్లుగొలిపే అత్యద్భుత దృశ్యాలవైపు, మృగపక్షి మిథునాలవైపు పరుగులు పెట్టాయి.

పరిసరవృక్షచ్ఛాయల్లో ఒంటరిగా తిరుగుతున్న ఒక మొగనెమలి లీలగా పురివిప్పి ఎక్కడో చెట్లకొమ్మల్లో దాగిన ఆడనెమలి కోసం గట్టిగా కేక పెట్టింది.

"పంచరంగు వన్నెల వీవనలా ఆ నెమలి ఎంత సొగసుగా నృత్యం చేస్తూందో".

నిట్టూర్చింది మనోరమ.

"దాన్ని పట్టుకు తీసుకురాగలవా?"

కన్నుగీటి చిరునవ్వుతో ప్రశ్నించాడు స్వరోచి. ఉన్న ముగ్గురిలోను తన్నే అంత ఆత్మీయంగా పిలిచి ఆ నెమలిని పట్టుకుని తీసికొనిరమ్మని స్వరోచి ఆజ్ఞాపించినందుకెంతో మురిసిపోయింది మనోరమ.

"ఆఁ! క్షణంలో పట్టుకుని తీసుకువస్తాను!"

అని మనోరమ ఆ నెమలిని పట్టుకోడానికొక్క పరుగు పెట్టింది. ఆ అదను కనిపెట్టి స్వరోచి కళావతి కళ్లురెండు గట్టిగా మూశాడు.

అతనికి తనమీద ఉన్నంత అనురాగం ఇక మిగిలిన ఇద్దరిమీద లేదనీ, కనుకనే అతడంత గట్టిగా తన కళ్ళు మూసి ఒడిలో కూర్చోబెట్టుకొన్నాడనీ కళావతి ఎంతైనా సంతోషించింది.

కాని స్వరోచి సవ్వడి కాకుండా ఆ ప్రక్కనే కూర్చున్న విభావసి చెక్కిలిపై చిక్కని ముద్దు ముద్రించాడు. ఆ మాయా నాటకం అంతా తనకోసమేనని విభావసి ఎంతైనా మురిసిపోయింది. ఆమె హృదయం ఆనందపారవశ్యంతో ఎగిరి గంతేసింది.

కాని స్వరోచి నేత్రాలు నెమలిని పట్టుకోవడానికి బయలుదేరిన మనోరమవైపు తిరిగాయి. ఆమె ఒకమారు వెనక్కి తిరిగి చూచింది. అంతలో స్వరోచి కొంటెతనం ఆమె కవగతమయింది. ఇక ఎంత తరిమినా ఆ నెమలి దొరకడంలేదని గిరుక్కున వెనక్కి తిరిగి వచ్చివేసింది.

"ఇప్పుడు మీరు ముగ్గురు పూర్తిగా ఓడిపోయారు!"

అని హేలగా నవ్వాడు స్వరోచి. వారు ముగ్గురు అతని కొంటెతనానికి కోపగించిన తీరులో కొంచెంసేపు క్రోధ నటించారు. కాని ఆపైన తమలో పొంగి పొరలుతున్న నవ్వాపుకోలేకపోయారు.

ఆ సుందరుల గాఢానురాగాలు, ఆ ప్రశాంత సరోవరతీరంలో వినిపించే మృగపక్షి మిథునాల కోలాహలాలు స్వరోచిని బాగా మైమరపింపజేశాయి.

తనవంటి భాగ్యశాలి ఇక "నభూతో న భవిష్యతి" అనుకొన్నాడు స్వరోచి. మనోరమ ఇందీవరాక్షుని తనూజ. అతడొక గంధర్వుడు. ఒక మహారణ్యంలో* ఒక రాక్షసుడామెను కబళించివెయ్యాలని తరుముకు వస్తూంటే స్వరోచి ఆమె కభయం ఇచ్చి

సంరక్షించాడు. చివరికి రాక్షసుడే ఇందీవరాక్షుడుగా మారిపోయి, తన శాప వృత్తాంతం అంతా స్వరోచికి తెలియజేశాడు. మనోరమ స్వరోచికిచ్చి వివాహం చేశాడు. ఆ ఉపకృతికి ప్రత్యుపకృతిగా ఆమె అతనికి అస్త్రహృదయవిద్య ఉపదేశించింది. ఇందీవరాక్షుడల్లుని కెన్నెన్నో కానుకలు బహూకరించాడు. కాలంతో శ్రమించి అభ్యసించిన ఆయుర్వేదరహస్యంకూడా అతని కుపదేశించాడు.

ఇక మిగిలిన విభావసీ కళావతు లిద్దరు మనోరమ చెలికత్తెలు. విభావసి మందార విద్యాధరుని కుమార్తె. ఆమె మృగపక్షి భాష లవగాహనచేసుకునే విద్యలో గట్టిదిట్ట.

కళావతి పారర్షి కుమార్తె. ఆమె కు పద్మినీవిద్య కరతలామలకం. ఆ విద్యారహస్యం తెలిసినవారి కాకలదప్పికల బాధ ఉండవు.

విభావసీకళావతు లిద్దరు మనోరమతో కలిసి అరణ్యంలో హాయిగా విహరిస్తూ ఒక వృద్ధముని కోపధాటికి గురయై దారుణ శాపాల పాలైనారు. ఆ శాపాలమూలంగా మనోరమకు రాక్షస బాధ సంప్రాప్తించింది. విభావసీ కళావతుల నిద్దరిని క్షయరోగం

★ మృగవేశన ★

పట్టుకుని పీకించింది.

మనోరమా వివాహం జరిగిన పిమ్మట స్వరోచి ఆమె చెలికత్తెలిద్దరి విషాదగాథ విన్నాడు. తన ఆయుర్వేద విద్యతో వారి రాజయక్ష్మ రోగాలు పూర్తిగా నయం చేశాడు. వారిద్దరుకూడా అతనిని వివాహం చేసుకొన్నారు. స్వరోచి చేసిన మహోపకృతికి ప్రత్యుపకృతిగా విభావసి అతనికి మృగపక్షి సంభాషణ లాకళింపు చేసే విద్యా మంత్రం బహూకరించింది. కళావతి పద్మినీ విద్యా రహస్యం బోధించింది.

ఆనాటినించీ వారు ముగ్గురు ఒకక్షణమైనా ఒకరినొకరు ఎడబాయకుండా హాయిగా విహరించారు.

వారి అపూర్వ సౌందర్యాలు, హావభావాలు, ఆ మనోహరారణ్యసౌందర్యము తిలచుకొన్న స్వరోచికి తానున్నది స్వర్లోకమేనని గట్టి నమ్మిక కలిగింది. ఆ ఆనందానుభూతిలో అతని నేత్రాంత్రాలు ప్రయత్నంగా ముకుళించాయి. అతని పార్శ్వంలో కూర్చున్న భార్యలు ముగ్గురు కొంతసేపేదో ఇష్టాగోష్ఠిలో పడ్డారు. ఆసమయంలో స్వరోచికేవో చిత్ర చిత్రమైన సంభాషణధ్వనులు వినిపించాయి.

2

"ఆహా! ఈ సుందరీమణులిటువంటి అందగానితో కలిసి మెలిసి విహరించడానికి పూర్వజన్మలో ఎంతటి మహత్తరమైన పుణ్యం చేసుకొన్నారో గదా!

"లోకంలో సామాన్యంగా ఒక వనితకొక మగవానిపై వలపు కలగవచ్చును. ఒక మగవాని కొక తరుణిపై మమత కుదిరించవచ్చును! కాని ఇద్దరికీ ఒకరొకరిపై సమానంగా అనురాగం కలగడమనేది ఈ లోకంలో అరుదు! ఈ అందగానికీ ముగ్గురు జవ్వనుల మీద వల్లమాలిన వలపేర్పడింది. అలాగే ఈముగ్గురు సుందరీమణులకు అతనిపై గాఢానురాగం కలిగింది. అతడు వీరందరి హృదయాలలోను పూవులలో తావిలా, పూసలలో దారంలా కుదురుకొన్నాడు. వీరందరినీ కళ్ళారా చూస్తుంటే నా కెంతో ముచ్చట వేస్తున్నదే!"

"చాలు! చాలులే! ఈ పొగడ్త! ఇదీ ఒక అనురాగమేనా?"

మొట్టమొదట వినబడిన ఆ ప్రశంస, తరవాత వినబడిన ఆ ఈసడింపు స్వరోచి హృదయంలో సూటిగా గుచ్చుకొన్నాయి. అయితే ఆ స్తుతి నిందలు చేసినవారెవరో అతనికి తెలియలేదు! ఆ పరిసరాలన్నీ అతి శ్రద్ధగా గాలించి చూచాడు. మానవులజాడ ఎక్కడా పొడగట్టలేదు. అతనికా సమయంలో మృగపక్షి భాషణ విజ్ఞాన విద్య జ్ఞాపకంవచ్చింది. ఆ విద్యా మంత్రం ఒకమారు పునశ్చరణ చేసుకొన్నాడు. అప్పటి కతనికా స్తుతి నిందలకు కారణభూతు లెవరో బోధపడింది.

అతని ఎదురుగా విశాల సరోవరంలో తామరాకుమీద నిలిచిన ఆడచక్రవాకపక్షి, తామరాకు గొడుగునీడలో నిలిచిన ఆడహంస కనపించాయి. ఆ చక్రవాకి ఇంకా అదే ధోరణిలో ఆహంసితో ఏదో చెబుతూంది. దాన్నిబట్టి ఆ హంసి మొదట ప్రశంస చేసిందనీ, అటుపిమ్మట ఆ చక్రవాకి దూషణ కుపక్రమించినదనీ స్వరోచి గ్రహించుకొన్నాడు. ఆ చక్రవాకిదూషణం అతనికి తిరిగి కర్ణకఠోరంగా వినిపించింది.

"ఈ వనితలు ముగ్గురికీ తమ ప్రాణేశుడు మరి ఒక అందగత్తెతో అనగి పెనగి క్రీడించిన సంగతి తెలుసునుగదా! అయినా వీరి కతనిమీద రోత బయలుదేరలేదు! తెగుదునమ్మ! అని మానాభిమానాలు విడిచి అనుక్షణము అతని వెంటనంటి సంచరిస్తున్నారు. మనలో మరి ఒక వనితతో క్రీడించిన భర్తపై ఇటువంటి మమకారా లెక్కడైనా ఉన్నాయా! ఇదంతా నీవదేపనిగా భట్రాజులా పొగడడం చూస్తే నాకేమీ రుచించడం లేదుసుమా!

"పలువురిమీద బయలుదేరిన మమకారం ప్రేమ అనిపించుకోదు! అందుచేత అతనికి వారియెడల కలిగినది ప్రేమ కానేరదు. ఆపైన వారిమాట అంతే!

"అంతఃపురంలోని దాసీజనంతో రారాజులెంతో ఆప్యాయంగా ప్రసంగిస్తూ పరిచర్యలందుకోవచ్చును! అంతమాత్రంచేత అది ప్రేమ అనిపించుకుంటుందా! ఈస్వరోచికీ జవ్వనులపై కలిగిన మమకారం కూడా అక్షరాలా అటువంటిదే!

"నిజంగా వీరిదీ ప్రేమఅయితే ప్రపంచంలో మరి ప్రేమానురాగాలే లేవన్నమాట!

"అందుచేత కేవలం దాసీజనంలా ఈ వయసుకాని వెంటబడిన ఈ అందగత్తెలను గురించి మరి నాయెదట మాటాడకు!"

ఆచక్రవాకి మరింత దురుసుగా స్వరోచినీ అతని భార్యలను కసిదీరా ఈసడించి వేసింది.

స్వరోచి ఉస్సూరుమని ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. మృగపక్షి భాషా రహస్యం తెలిసిన విభావసి ఆసమయంలో కళావతీ మనోరమలతో ఒక మొదలు, ఏ లేకుండా ఏమేమో ప్రసంగిస్తూంది. అం చేత ఆమె కా ఈసడింపు వినబడనేలే చక్రవాకి మళ్లీ మరింత దురుసు మొదలుపెట్టింది:

"ఆజన్మాంతము ఒకే ఒక పురుష యెడలగాని, ఒకేఒక స్త్రీయెడలగాని కలిగిన నిజమైన ప్రేమ!

"నాకే అటువంటి మహాప్రేమభాగ్య కలిగింది. నాకు నాభర్తపై మిక్కుటమై ప్రేమ ఏర్పడింది. ఆయనకున్నూ నాయెడ అటువంటి మహత్తరప్రేమే కలిగింది. అం చేత వీరందరి అనురాగాలకన్నా మా ప్రే గొప్పది! ఈవిషయంలో మేమే ధన్యులం!

అని సగర్వంగా ఒయ్యారంగా ఒళ్లు తిప్పుకుంటూ ఆచక్రవాకి ఆప్రసంగం అంతటితో ఆపివేసింది. హంసి మరి మాటాడలేక తలవంచుకుంది.

స్వరోచి మరింత ఖిన్నుడయ్యాడు. అతని శిరస్సు ఇంకా కిందికి వంగిపోయింది.

అతడక్కడినించి లేచి ఆకొలని కనతిదూరంలో మరిఒక చోట కూర్చున్నాడు. భార్యలతని వెంటబడ్డారు.

వారి కతని మనోవైకల్యాని కారణమేమో తెలియలేదు. అందరు అనేకవిధాలుగా అతని కుల్లాసం కలిగించారు. అడివి పళ్లు, పుట్టతేనె మొదలైన భక్ష్య భోజ్యాలెన్నెన్నో అతని ముందుంచి బలవంతంగా ఆరగింప జేశారు. క్రమక్రమంగా అతని హృదయం కలత దీరింది.

కామవ్యామోహం మహాచెడ్డది. మళ్ళీ కొంతకాలానికి స్వరోచి వారి భోగజాలాలలో తగుల్కొన్నాడు. అలాగలాగ మరి కొన్ని ఏళ్ళు గడిచిపోయాయి. మరికొంత కాలాని కతడా చక్రవాకి దూషణమే మరిచిపోయాడు.

3

ఒకనాడు స్వరోచి తన ముగ్గురు భార్యలతోను కలిసి అరణ్యసరోవరాని కనతి దూరంలో విహరిస్తూ ఒక శిలాఫలకంమీద విశ్రమించాడు. భార్యలు ముగ్గురు అతన్ని చుట్టిముట్టి కూర్చున్నారు. కొంతసేపేదో ఇష్టాగోష్ఠి నడిచింది.

వారి కనతి దూరంలో లేళ్ళ గుంపొకటి ప్రత్యక్షమైంది. స్వరోచి భార్యలకా లేళ్ళ గుంపు చూపించాడు. వాటి స్వేచ్ఛా విహారాలు వారి హృదయాలాకర్షించాయి. అందరు రెప్పపాటు లేకుండా కొంతసేపావైపే చూచారు. క్రమక్రమంగా స్వరోచి భార్యలు ముగ్గురు మళ్ళీ అతనితో కలిసి ఏవో లోకాభిరామాయణం మొదలు పెట్టారు.

స్వరోచికి తానేమైనా మాట్లాడు కుంటున్నారేమో వినాలని కొంచెం కుతూహలం బయలుదేరింది. క్రమంగా అన్ని లేళ్ళూ అతనికి సమీపానికి వచ్చి నిలబడ్డాయి.

ఆ ముగ్గురు అతనితో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూనే ఉన్నారు. స్వరోచి వినీ విననట్లుగా వారికేవేవో సమాధానాలిస్తూనే ఉన్నాడు. కాని అతని దృష్టి అంతా ఆ లేళ్ళ మీదనే నిలిచింది.

అంతలో ఆడలేళ్ళు రెండూ మూతి మొగలేడి ముఖానికి దగ్గరగా మూతులు పెట్టి, చిగురుల వంటి నాల్కలతో మోర మూమూచాయి. వాటి ఆప్యాయత చూస్తే స్వరోచి కెంతో ముచ్చట వేసింది. అంతలో అతనికి మగలేడి మాట్లాడుతున్న సవ్వడి వినిపించింది. చెవులొగ్గి అతడెంతో జాగ్రత్తగా ఆలకించాడు. మగలేడి మాట్లాడిన దొక్కొక్క మాటే ఈటెలా అతని శ్రుతికుహరాల్లో నాటుకుంది. మొదట ఆ మగలేడి ఆడలేళ్ళనిద్దరినీ గట్టిగా కసిరింది. ఆపైన అంతకన్నా గట్టిగా చీవాట్లు పెట్టింది:

"చాలు! చాల్లెండి, ఈ సరసాలు! నేనేమయినా స్వరోచి ననుకున్నారా పొద్దస్తమానకు మీతో కాలక్షేపం చేయడానికి? మీకు బొత్తిగా సిగ్గు, లజ్జ లేకుండా ఉందే! అంతగా కోరుకూడదు అనుకుంటే ఇంకొక మగలేడి నెక్కడయినా వెతికి పట్టుకోండి! నాకు మిమ్మల్ని చూస్తేనే రోతపుడుతూంది!

"పదిమంది భార్యలతో కూడి క్రీడించడమన్నది కేవలం భోగవాంఛే గాని మరొకటి కానేరదు! ఈ స్వరోచి భార్యలిచ్చిన విద్యలతో కన్నుమిన్ను కానకుండా మోహపాశాలలో తగుల్కొన్నాడు! ఇతనికిక ఇహము, పరముకూడా శూన్యమే. మరి నాకు కూడా ఇహపరాలు లేకుండా చెయ్యాలని చూస్తున్నారేమో! నేనటువంటి దాన్ని కానేకాను. పొండి! ఇక నాఎదట నిలబడకండి! నేనిప్పటినుంచీ ఒక నియమం అవలంబించాను. మృగప్రాయంగా సంచరించడానికి నేనేమీ స్వరోచివంటి భోగ లాలసుణ్ని కాను! తెలిసిందా!"

అతని హృదయంలో ఆ మాటలొక్కొక్కటే వరసగా ములుకుల్లా నాటుకొన్నాయి. స్వరోచి తనకు భార్యలయెడల, భార్యలకు తనయెడల కలిగిన మమకారము, వ్యామోహము, కేవలం ప్రేమే అనీ, తన అంతటి అదృష్టవంతుడిక పుట్టబోడని ఎంతయినా అహంకరించాడు. అతని ఆదురహంకారం అంతా ఆ క్షణంతో పటాపంచలయిపోయింది!

అతడిక కళ్ళెత్తి తన భార్యలవైపే చూడలేక పోయాడు. పెడమొహం పెట్టుకుని కూర్చున్న అతని హృదయంలో పూర్వం ఆ చక్రవాకి, ప్రస్తుతం ఆ లేడిచేసిన దూషణ తిరస్కారాలు మాటిమాటికీ అలాగే ప్రతిధ్వనించాయి.

ఖిన్నతలో అతని శిరస్సింకా కిందికి వంగిపోయింది.

అదేసమయంలో అతని హృదయంలో ఆ పూర్వచక్రవాక మిథునం దివ్యానురాగమే అత్యంతమనోజ్ఞమైనదిగా, పునీతమైనదిగా స్ఫురించింది.

ఆకాశంలో ఒక చక్రవాకమిథునం కలకలలాడుతూ పైకెగసి రివ్వుమని అంతరిక్షాన్నే అందుకుంది! ★

చల్లనైన, తెల్లని

బ్రిల్‌క్రీమ్ BRYLCREEM

బ్రిల్‌క్రీమ్ వాడి మీ కేశములను ఎక్కువ నిగనిగలాడుచు నలుపుగా ఉంచుకొనండి

★ బ్రిల్‌క్రీమ్‌లోనున్న పరిశుభ్రమైన పేరుకున్న మానెలు మీ కేశముల సహజ నల్లదనమును, తళతళ మెరుస్తు కనపడేలాగ చేయును.
★ శుభ్రమైన, తెల్లని బ్రిల్‌క్రీమ్‌ను ప్రతిరోజు మీ శిరస్సునకు వాడండి. ఇది చుండ్రు లాకుండా మీ కేశములను శుభ్రముగ మరియు ఆరోగ్యకరముగా నుంచును.
★ బ్రిల్‌క్రీమ్ కొద్దిగా రాచేకుంటేనే చాలును! అందువలన పొదుపు చేకూరును. నేడే ఒక సీసాను కొని మీకు మీరే నిర్ధారణ పరచుకొండి.

రామ్‌చంద్ — ఈ ప్రఖ్యాతి గాంచిన భారతీయ టెస్ట్ క్రికెటర్. ఎక్కువ మెఱుగైన, నల్లని కేశములకు ఉన్నతి పొందేవారు వాడే బ్రిల్‌క్రీమ్ వాడును



బహు ఉన్నతి పొందిన వారు వాడేది

బ్రిల్‌క్రీమ్